క్లుప్తంగా

వ్యర్థాలు తొలగించరూ



కృష్ణాబార్ మార్గంలో చెత్తకుప్ప

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ గాడితప్పింది. కృష్ణా బార్ వెనుక మార్గం నుంచి విజ్ఞాన్ టాలెంట్ స్కూల్‌కు వెళ్లే మార్గంలో వాడుకనీరు రోడ్డుపైకి వస్తుంది.దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అలాగే మార్కెట్ లైన్‌కు వెళ్లే మార్గంలో కాలువల్లో తొలగించిన వ్యర్థాలు దుకాణాల ముందు విడిచిపెట్టారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. శానిటరీ అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగించడంతో పాటు శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

సమాజంపై అవగాహన తప్పనిసరి



సెక్రెడ్ హార్ట్ పాఠశాలలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

కంచరపాలెం: విద్యార్థి దశ నుంచే సమాజంపై పూర్తి అవగాహన ఉండాలని కంచరపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్ అన్నారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్స్ బాలికల ఇంగ్లీష్ మీడియం స్కూల్, సెక్రెడ్‌హార్ట్ బాలికోన్నత పాఠశాల బుధవారం విద్యార్థులకు పిల్లల అక్రమ రవాణా, సోషల్ మీడియా ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. సీఐ రవికుమార్ మాట్లాడుతూ చిన్న వయసులోనే సోషల్ మీడియాకు అలవాటు పడటం వల్ల తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు ఉంటాయన్నారు. తెలియని వ్యక్తులతో పరిచయాలు పెట్టుకోవద్దని, అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే తెలియజేయాలని అన్నారు. పిల్లలు సోషల్ మీడియాలో ఏం చూస్తున్నారో, ఏం చేస్తున్నారో గమనిస్తూ నిరంతరం గమనించాలన్నారు. అనంతరం సెయింట్ జోసెఫ్ పాఠశాల నుంచి జ్ఞానాపురం బరియల్ స్ట్రీట్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐలు అజయ్, అరుణ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు రెవరెండ్ సిస్టర్ మేరీ రోస్, రెవరెండ్ సిస్టర్ మేరీ హెలెన్, రెవరెండ్ సిస్టర్ వేళంగిణి, అగ్నస్ ఆనందిని, రెవరెండ్ సిస్టర్ జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులకు సురక్షితమైన తాగునీరు



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, తదితరులు

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులో పర్యాటకుల సౌకర్యార్థం దివీస్ లేబొరేటరీస్ రెండు ఆర్వో ప్లాంట్‌లను ప్రారంభించింది. కురుసుర మ్యూజియం, టీయు-142 యుద్ధ విమానం వద్ద ఏర్పాటు చేసిన ఈ యూనిట్లను వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ పర్యాటకులకు సురక్షితమైన తాగునీటిని అందించడానికి దివీస్ యాజమాన్యం అందించిన సహకారం మరువలేనిదన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, కార్యనిర్వాహక ఇంజనీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్, దివీస్ ప్రతినిధులు జీఎం వైఎస్ కోటేశ్వర రావు, సీఎస్సార్ మేనేజర్ డి.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు నిత్యకల్యాణం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞో పవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ఎరక్క వచ్చి... ఇరుక్కుపోయి!

- ఎన్ఏడీ ఫ్లై ఓవర్ ఎక్కేందుకు లారీడ్రైవర్ల అగచాట్లు
- డైవర్షన్ ఎక్కడ తీసుకోవాలో తెలియక తికమక
- హైట్ బారియర్ తగిలి నిలిచిపోతున్న భారీ వాహనాలు
- రాత్రంతా తప్పని జాగారం



సర్వీసు రోడ్ లోంచి ఫ్లై ఓవర్ కిందకి వచ్చేస్తున్న భారీ లారీ



లారీ ఢీకొనడంతో ఊడిపోయిన గడ్డర్ (ఫైల్)



ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌పైకి వచ్చేందుకు డైవర్షన్ తీసుకోవాల్సింది ఇక్కడే..

విశాఖ విద్య: బీఆర్‌టీఎస్ రోడ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు భారీ వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వాహనాల స్పీడుకు బ్రేకులు వేయడంతో పాటు రాత్రి వేళ కుర్రకారు రేసింగ్ నిర్వహిస్తున్నారని తెలుసుకున్న పోలీసులు వీటికి అడ్డకట్ట వేసేలా బీఆర్‌టీఎస్ మధ్యదారులను మూసేస్తున్నారు. ఇంత వరకూ బాగానే ఉన్నా రోడ్లపై డైవర్షన్ ఎక్కడ తీసుకోవాలనే దానిపై స్పష్టత లేకపోవడంతో రాత్రి వేళ ప్రయాణం సవ్యంగా సాగడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

ఎన్ఏడీ వద్ద అగచాట్లు

అనకాపల్లి- విజయనగరం హైవేలో ప్రయాణించి పెందుర్తి మీదుగా భారీ వాహనాలు ఇటీవల నగరంలోకి ఎక్కువగా ప్రవేశిస్తున్నాయి. ఇలా వచ్చే వాహనాలకు ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వద్ద బ్రేకులు పడుతున్నాయి. బీఆర్‌టీఎస్ మధ్య దారి మూసేయడంతో భారీ వాహనాలు సైతం సర్వీస్ రోడ్డులోంచే రావాలి. పెందుర్తి నుంచి వచ్చే వాహనాలు గోపాలపట్నం బాజీ జంక్షన్‌లో డైవర్షన్ తీసుకొని బీఆర్‌టీఎస్ మధ్య దారిలోకి ప్రవేశించి ఫ్లై ఓవర్ పైకి రావాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే భారీ వాహనదారులకు ఇది తెలియక రయ్ మంటూ ఎన్ఏడీ ఫ్లై ఓవర్ కిందకు వచ్చేస్తున్నారు. కింద నుంచి భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. మళ్లీ యూటర్న్ కోసం అరకిలో మీటరు మేర సర్వీసు రోడ్‌లో వెనక్కి వెళ్లాల్సి వస్తోంది.

రాత్రంతా జాగారమే

నగరంలోకి సరకుల దిగుమతి కోసం వచ్చే భారీవాహనాలు ఎన్ఏడీ వద్ద చిక్కుకుపోతున్నాయి. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఎక్కువగా పెందుర్తి-ఎన్ఏడీ బీఆర్‌టీఎస్ రోడ్‌లో భారీ వాహనాలు వస్తున్నాయి. డైవర్షన్ ఎక్కడ తీసుకోవాలో తెలియక ఫ్లై ఓవర్ కిందకు వచ్చేస్తున్న వాహనాలు తిరిగి వెనక్కి వెళ్లడం ఇబ్బందిగా మారుతోంది. భారీ లారీలు కావడంతో గంటల తరబడి సమయం పట్టేస్తోంది. ఒక్కో సారి రోడ్డుకు అడ్డంగా లారీలు ఉండిపోతున్నాయి. తెల్లవారుజామున పరిసర ప్రాంతాలకు ఆ దారిలో ప్రయాణించేవారికి అసౌకర్యం కలుగుతోంది.

ముందు జాగ్రత్త చర్యలేవీ?

ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రధాన కూడళ్లలో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టడంలో పోలీసు యంత్రాంగం విఫలమవుతుందనే విమర్శలు ఉన్నాయి. పెందుర్తి- ఎన్ఏడీ బీఆర్‌టీఎస్ రోడ్‌లో సర్వీసు రోడ్‌లోంచి ఫ్లై ఓవర్ కిందకు భారీవాహనాలు వచ్చేయకుండా బాజీ జంక్షన్ వద్ద రోడ్డుకు అడ్డంగా హైట్ బారియర్ ఏర్పాటు చేశారు. కానీ, ఇటీవల ఓ లారీ దీన్ని ఢీకొట్టడంతో విరిగిపోయింది. దాన్ని తొలగించిన పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యలపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రైలులో 'విత్తన' బంతాట

ప్రజల్లో అవగాహన పెంచేందుకు వినూత్న కార్యక్రమం



రైలు నుంచి విత్తన బంతులు చల్లుతున్న దృశ్యం

గోపాలపట్నం: పర్యావరణానికి మొక్కలే ఆధారం... ఆ మొక్కలు పుట్టేందుకు విత్తనాలు కారణం. మానవ మనుగడ నిలపడం కోసం మొక్కలు పెంచేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు పాటుపడుతున్నాయి. అందులో భాగంగా జేడీ ఫౌండేషన్ సభ్యులు వినూత్నంగా రైలులో వెళ్తూ ప్రయాణికులకు విత్తన బంతుల గురించి వివరిస్తూ వారి చేత మైదాన ప్రాంతాల్లో విత్తన బంతులు చల్లించారు. ఈ సందర్భంగా జేడీ ఫౌండేషన్ విశాఖ కన్వీనర్ సలాది శ్రీరామకృష్ణయ్య మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా పర్యావరణ పరిరక్షణకు పలు రకాల కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేత 50 వేల వరకు విత్తన బంతులు తయారు చేయించామన్నారు. వాటిని కొండవాలు ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో ఇంజినీరింగ్, హైస్కూల్ విద్యార్థుల చేత చల్లించామని తెలిపారు. ఈ చర్యల వల్ల మొక్కల పెంపకంపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. బుధవారం ఉదయం అరుకు రైలులో సింహాచలం నుంచి ఎస్.కోట వరకు ప్రయాణం చేసి మైదాన ప్రాంతాల్లో ప్రయాణికుల చేత చల్లించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దేవమాత మోక్షారోపణ ఉత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్, పీపీసీ సభ్యులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చి ఆధ్వర్యంలో 125వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ఆగస్టు 1 నుంచి నిర్వహించనున్నామని పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు. బుధవారం సెయింట్ పీటర్స్ చర్చి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 1 శుక్రవారం సాయంత్రం స్లీప్‌గుర్తు మండపంలో విశాఖ అగ్రపీఠం పరిపాలనాధికారి బిషప్ పొలిమేర జయరావు పతాకావిష్కరణ చేస్తారని, అనంతరం తిరువీధుల్లో తేరు (పల్లకి) ఊరేగింపు ఉంటుందన్నారు. ఆగస్టు 14 వరకు తేరు పలు వీధుల్లో తిరుగుతుందని, 15న విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ ఉడుమల బాల ఆధ్వర్యంలో ప్రధాన ఉత్సవాలు జరుగుతాయన్నారు. అనంతరం పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫాదర్లు పి.విమల్‌రాజ్, ఫాదర్ వై.ప్రేమ్‌కుమార్, పీపీసీ అధ్యక్షుడు ముసిరి రాజేష్, కమిటీ సభ్యులు మరియరత్నం, ఫ్రాన్సిస్, గురు మండలి సలహా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమం

ఐద్వా నాయకుల పిలుపు



ఐద్వా గాజువాక జోన్ నూతన కార్యవర్గం

గాజువాక: విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించకుండా మహిళలు సైతం ఉద్యమించాలని ఐద్వా గాజువాక జోన్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీనగర్‌లో బుధవారం నిర్వహించిన ఆ సంఘం గాజువాక జోన్ 9వ మహాసభలో నాయకులు ప్రసంగించారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, వై.సత్యవతి మాట్లాడుతూ అదానీ స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగి ప్రజలపై భారాలు పడతాయన్నారు. కొత్త మీటరు వేయడం వల్ల వినియోగదారునిపై రూ.9వేల భారం పడుతుందన్నారు. స్మార్ట్ మీటరుకు ఉదయం ఒక రేటు, రాత్రి సమయాల్లో మరో రేటు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మహిళలపై హత్యలు, అత్యాచారాలను అరికట్టేవరకు విస్తృత పోరాటాలు నిర్వహించాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎల్.కామేశ్వరి, జి.లక్ష్మితో పాటు ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సహాయ కార్యదర్శులు, మరో 12 మంది ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణలక్ష్మి పూజలు



భక్తుల పూజలందుకుంటున్న సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు బుధవారం నాటికి 6వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

విత్తన రాఖీల తయారీపై అవగాహన

ఎంవీపీకాలనీ: గ్రీన్ క్లైమేట్ టీమ్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం వీఎంసీ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు విత్తన రాఖీల తయారీపై అవగాహన కల్పించారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ ఏపీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.వి.మురళీమోహన్ మాట్లాడుతూ ప్రకృతికి హాని కలిగించే చర్యలకు ప్రజలు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ జవహర్‌నగర్ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఐజీ కాలనీ -1,2 ఏరియాలు,లేబర్ జంక్షన్,అశోక్‌నగర్,హనుమాన్‌సంజీవ్‌కాలనీ,ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ,కొత్తనక్కవానిపాలెం,వాయుపుత్రకాలనీ ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మల్కాపురం సబ్‌స్టేషన్ పరిధిలో...

జనతాకాలనీ,దుర్గానగర్ ఫీడర్ల పరిధిలోని జనతా కాలనీ,వెంకన్నపాలెం,ఇండస్ట్రియల్‌కాలనీ,ఆర్‌కే పురం,హెచ్‌పీసీఎల్ ఏరియా,సెయింట్ ఆన్స్ పాఠశాల,కళాశాల ఏరియా,దుర్గానగర్,ఏఎస్ఆర్‌కాలనీ,గుడివాడ అప్పన్నకాలనీ,ఎన్‌టీఆర్‌కాలనీ,టీడీపీ కాలనీ,అంబేడ్కర్‌కాలనీ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

మర్రిపాలెం: జోన్-2 ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలోని కాకానినగర్, ఎన్ఏడీ, మాధవధార ఫీడర్ల నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాకేతపురం, రెల్లి వీధి, వినోద్‌నగర్, విమాన్‌నగర్, కాకానినగర్, ఎస్‌వీకే నగర్, ఎన్ఏడీ, పంజాబీ దాబా ఏరియా, ఐఎన్ఎస్ డేగా ఏరియా, ఆర్‌టీవో ఆఫీస్ రోడ్డు, సచివాలయం ఏరియా, ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మహా ధర్నా విజయవంతానికి పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

దాబాగార్డెన్స్: రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పీస్ రేట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 7న 'ఛలో విజయవాడ'కార్యక్రమం నిర్వహించనున్నట్టు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సిటు కార్యాలయంలో చలో విద్యుత్ సౌదా పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 26 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సబ్ స్టేషన్ ఆపరేటర్స్, పిక్ లోడ్, సెక్షన్ ఆపరేటర్లు, ఏటీపీ ఆపరేటర్లు, మీటర్ రీడర్లు, స్టోర్స్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న హమాలీలు పని చేస్తున్నారని తెలిపారు. వీరందర్నీ రెగ్యులర్ చేస్తామని అనేక సంవత్సరాల నుంచి ప్రభుత్వాలు హామీ ఇస్తున్నా అమలు చేయడం లేదన్నారు. ఆగస్టు 7న చేపట్టే మహాధర్నాకు కార్మికులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్, ఆర్.సత్యారావు, ఎస్.అవతారం, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలను మింగేస్తున్నారు

విశాలమైన గెడ్డలు చిన్న కాలువల్లా మారిపోతున్నాయి. భారీ వర్షాలు వచ్చినప్పుడు ఎగువ ప్రాంతాలు, కొండల నుంచి వచ్చే వర్షం నీరు దిగువ ప్రాంతాలకు చేరి ముంపునకు గురికాకుండా అధికారులు ముందస్తు ఆలోచనతో కోట్లు వెచ్చించి, నిర్మించిన విశాలమైన గెడ్డలు ఇప్పుడు కుచించుకుపోతున్నాయి. గెడ్డలను ఆనుకుని నివసిస్తున్న వారే వీటిని ఆక్రమించేస్తున్నా అధికారులు గానీ, సిబ్బంది గానీ అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో భవిష్యత్తులో ఇవి అంతరించిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదేమో అన్నట్లుగా ఉంది పరిస్థితి.

- కాల్వలుగా మారుతున్న గెడ్డలు
- కన్నెత్తి చూడని అధికారులు
- భారీ వర్షాలు వస్తే ముంపు ముప్పు



61వ వార్డు అంబేడ్కర్ కాలనీ వద్ద ఆక్రమణకు గురవుతున్న గెడ్డ



ప్రకాష్‌నగర్ గెడ్డపై ప్రైవేట్ వ్యక్తులు నిర్మించిన మార్గం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధి అచ్చినాయుడులోవ, జనతాకాలనీ శివారు ప్రాంతాల్లో ఎత్తయిన కొండలు ఉన్నాయి. భారీ వర్షాలు వచ్చినప్పుడు కొండ ప్రాంతం నుంచి, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షం నీరు దిగువ ప్రాంతాల్లోకి చేరడంతో చాలా ఇబ్బందికరంగా ఉండేది. దీనిపై స్పందించిన అధికారులు సుమారు 20 ఏళ్ల క్రితం అచ్చినాయుడులోవ, జనతాకాలనీ కొండ ప్రాంతాల నుంచి దిగువ అంబేడ్కర్ కాలనీ, ప్రకాష్‌నగర్, గాంధీజీవీధి, మల్కాపురం మీదుగా హెచ్‌పీసీఎల్ రక్షణ గోడ దిగువ నుంచి సముద్రంలో కలిసే విధంగా సుమారు 10 అడుగుల వెడల్పుతో ఎత్తయిన గెడ్డలను నిర్మించారు. దీంతో ఎంత పెద్ద వర్షాలు వచ్చినా దిగువ ప్రాంతాలకు ఇబ్బంది ఉండేది కాదు. అయితే, ఈ గెడ్డలను కొంతమంది నివాసితులు తమ స్వార్థం కోసం ఆక్రమించేస్తున్నారు. కొందరు దర్జాగా గెడ్డపై వంతెనలా ఇళ్ల మధ్య మార్గం నిర్మించుకున్నారు.

మరోవైపు గెడ్డల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, వాటిని నెలల తరబడి తొలగించకపోవడం వంటి సమస్యలు, మరికొన్ని గెడ్డల మధ్య పిచ్చిమొక్కలు పెరిగి గెడ్డలోకి వెళ్లలేని పరిస్థితులున్నాయి. మరో చోట గెడ్డపై భవన నిర్మాణ సామగ్రితో పాటు స్టేజ్ సామగ్రి వంటివి వేసేస్తున్నారు. దీంతో భవిష్యత్తులో గెడ్డల పరిస్థితి ఏమిటా అని పలువురు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యపై స్పందించాలని పలువురు కోరుతున్నారు.



జనతాకాలనీ శివారు ప్రాంతంలోని గెడ్డ కాలువగా మారిన వైనం

ప్రజారోగ్యాన్ని కాపాడాల్సింది ప్రభుత్వాలే..

- మూఢ నమ్మకాలతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు
- నెల్లూరు జీఎంసీ ప్రొఫెసర్ కాలేషా సాహెబ్



మాట్లాడుతున్న డాక్టర్ కాలేషా సాహెబ్

పెందుర్తి: దేశంలో ప్రజారోగ్యం తీవ్రమైన గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందని, మూఢ నమ్మకాలను అధిక శాతం నమ్మడం వలనే ఇలాంటి దుస్థితి నెలకొందని నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌కే కాలేషా సాహెబ్ అన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందని స్పష్టం చేశారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్త్ సినారియో ఇన్ ఇండియా అనే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో శాస్త్రీయ పద్ధతిలో కాకుండా మూఢనమ్మకాలు, చాందస భావాలతో కొందరు వ్యక్తులతో పాటు ప్రభుత్వాలు కూడా ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నాయని ఆక్షేపించారు. మూఢ నమ్మకాలను సమూలంగా నిర్మూలించే దిశగా, శాస్త్రీయ పద్ధతిలో ప్రజారోగ్యం బాగుచేసే కోణంలో ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళీధర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, జేవీవీ ప్రతినిధులు ఎల్.కృష్ణారావు, ప్రసాద్, పరశురాం, శేషగిరిరావు, రమణ శర్మ, ప్రసాద్, వాసుదేవరావు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని వేధించే సమస్య మానవ అక్రమ రవాణా



మానవ అక్రమ రవాణాపై సకల్య సంస్థ అవగాహన ర్యాలీ

దాబాగార్డెన్స్: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం 30వ వార్డులో 'సకల్య' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవ అక్రమ రవాణా ఒక వ్యవస్థీకృత నేరమని, ఈ దోపిడీని అంతం చేయాలంటూ నినదిస్తూ ర్యాలీ చేపట్టారు. ర్యాలీని విశాఖ ఫుట్‌పాత్ వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్రబిల్లి ప్రభాకరరావు ప్రారంభించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న లీగల్ సర్వీస్ ప్యానల్ అడ్వకేట్ పి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా గురించి అవగాహన పెంచడం, నేరాన్ని నిరోధించడానికి, ఎదుర్కొనే చర్యలను ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పించడానికి జిల్లా లీగల్ సర్వీస్ బాధితులకు అండగా నిలుస్తుందన్నారు. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితం చేసే తీవ్ర సమస్య అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దోపిడీ, అక్రమ రవాణా నుంచి సురక్షితంగా ఉండే ప్రపంచాన్ని సృష్టించడానికి కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు.

స్కూల్ గేమ్స్ కార్యదర్శి నియామకానికి దరఖాస్తులు

పరవాడ: ప్రస్తుత(2025-26), రానున్న (2026-27) విద్యా సంవత్సరానికి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నియామకం కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 58 ఏళ్ల లోపు వయసున్న స్కూల్ అసిస్టెంట్లు(పీడీ, పీఈటీ)లో కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు ఈ నెల 31లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావును సంప్రదించాలని సూచించారు.